క్లుప్తంగా

తనవాటా భూమి దక్కడం లేదని యువకుడి ఆత్మహత్య


నాగరాజు(ఫైల్)

దామెర: తన వాటా భూమి దక్కడంలేదనే కారణంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై అశోక్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన పున్నం నాగరాజు(36) తన కు వారసత్వంగా రావాల్సిన ఎకరం భూమిని తన సొంత అక్క ఉమారాణితోపాటు చిన్నమ్మ కుమారులు రామకృష్ణ, పూర్ణచందర్ ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. దీంతో నాగరాజు పలుమార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ సమయంలో నాగరాజుకు భూమి ఇస్తామని ఒప్పుకుని తర్వాత ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు.. జనవరి 24న గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. నాగరాజు భార్య మమత ఫిర్యాదు మేరకు ఉమారాణి, రామకృష్ణ, నార్లగిరి పూర్ణచందర్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్సై వెల్లడించారు.

దూరవిద్యలో మూడు పుస్తకాలు విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని దూరవిద్య కేంద్రంలో పీజీ కోర్సుల ఆర్ట్స్ మొదటి సెమిస్టర్‌కు సంబంధించిన మూడు పుస్తకాలను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, ఆర్ట్స్ కోర్సుల కోఆర్డినేటర్ డాక్టర్ కొట్టి భాస్కర్ సోమవారం విడుదల చేశారు. దూరవిద్య పీజీలో సెమిస్టర్ సిస్టమ్ విధానం కొనసాగుతోంది. సెమిస్టర్ విధానం వచ్చాక నూతనంగా సెమిస్టర్ విద్యార్థులకు ఆర్ట్స్‌లో తెలుగు సాహిత్య చరిత్ర, వ్యాకరణం, ఆంధ్రుల చరిత్ర – సంస్కృతి పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీఎల్‌సీఈ బుక్స్ స్టోర్ ఇన్‌చార్జ్ తాలియాల కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'డీజే'లు పెడితే కఠిన చర్యలు

రామన్నపేట: వివాహ, ఇతర వేడుకల్లో డీజే సౌండ్స్ పెట్టే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ హెచ్చరించారు. ఇంటర్మీడియేట్, ఎస్సెస్సీ, ఇతర పరీక్షలు ఉన్నందున వివాహ ఊరేగింపుల్లో, ఇతర వేడుకల్లో డీజే సౌండ్స్ పెట్టి విద్యార్థులు, వృద్ధులు, చిన్న పిల్లలకు ఇబ్బంది కలిగించే డీజే సౌండ్స్ ఆపరేటర్లు, యజమానులు, వేడుకల నిర్వాహకులపై కేసులు నమోదు చేసి డీజేలను సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

మడికొండ పీఎస్ సందర్శన

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్‌ను కాజీపేట ఏసీపీ తిరుమల్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను పరిష్కరించాలని ఇన్‌స్పెక్టర్ కిషన్‌కు సూచించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌కు పలు సూచనలు చేశారు.

కేయూలో నేడు 'అకుట్' ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుల సంఘం (అకుట్) ఎన్నికలు ఈనెల 4న జరగనున్నాయి. అధ్యక్ష పదవికి ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ వెంకట్రాంరెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ మల్లికార్జున్‌రెడ్డి, జనరల్ సెక్రటరీగా బయో టెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాస్, మ్యాథ్‌మెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌పీ.రాజ్‌కుమార్ పోటీ పడుతున్నారు. మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ నిర్వహించనున్నారు. 5న యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాలను వెల్లడించనున్నారు. కేయూ పరిధిలో 76మంది అధ్యాపకులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

వన్యప్రాణులను రక్షించాలి

విద్యారణ్యపురి: వన్యప్రాణులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని రిటైర్డ్ డీఎఫ్‌ఓ పురుషోత్తం అన్నారు. వన్యప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో సోమవారం సింపోజియం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ తప్పిదాలతో వన్యప్రాణులు తమ ఆవాసాన్ని కోల్పోయి, క్రమంగా అవి అంతరించిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వన్యప్రాణుల సంరక్షణపై ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రవీణ్ కుమార్, కన్వీనర్ డాక్టర్ దినేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ గోరె, సభ్యులు డాక్టర్ రాజయ్య, డాక్టర్ రోహిణి, డాక్టర్ స్వామి, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు, పోస్టర్ల ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

స్వచ్ఛతతో మా పల్లె మెరిసే..


వేకువజామున రోడ్డు శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

- ప్రతీరోజు పారిశుద్ధ్య పనులు
- పంచాయతీ సిబ్బంది పనితీరుపై స్థానికుల ప్రశంసలు

నడికూడ : పరిసరాల పరిశుభ్రతతో మిగతా గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోంది మండల కేంద్రం.. రోజువారి కార్యాచరణలో భాగంగా పక్కా ప్రణాళికతో గ్రామ ప్రత్యేక అధికారి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చేతన్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది చురుకుగా పనులు చేస్తూ గ్రామాన్ని క్లీన్‌గా ఉంచుతున్నారు. పంచాయతీ కార్యదర్శికి ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వడంతో పాటు ప్రతిరోజు గ్రామపంచాయతీ సిబ్బంది చేస్తున్న పనులపై గ్రామానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో సిబ్బంది పనులపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే గ్రామంలోని యువత, గ్రామస్తులు వీధిలైట్లు, చెత్త సేకరణ, తాగు నీటి సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందిస్తున్నట్లు పలువురు తెలిపారు. గ్రామ పంచాయతీ ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విధులు నిర్వహిస్తూ గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చూస్తున్నారు. గ్రామస్తుల సహకారంతో పంచాయతీ సిబ్బంది రోడ్డుకిరువైపులా గల పిచ్చిమొక్కలను తొలగిస్తూ, సైడ్ డ్రెయినేజీలను శుభ్రపరుస్తున్నారు. సీజనల్ వ్యాధులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామపాలనలో గుణాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు ప్రజల భాగస్వామ్యంతో అధికారులు కృషి చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

ఆదర్శ గ్రామం దిశగా..



ప్రతి రోజు ఉదయం పనులను పర్యవేక్షణ చేసి పంచాయతీ సిబ్బందికి సూచనలు చేస్తున్నాను. గతంలో నేను రామకృష్ణపూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించాను. అప్పుడు ఉత్తమ జేపీ అవార్డు రావడం సంతోషాన్ని ఇచ్చింది. మరో ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పనిచేస్తున్నాను.

– భిక్షపతి, పంచాయతీ కార్యదర్శి

క్లీన్ అండ్ గ్రీన్‌కి ప్రాముఖ్యం



మండలంలోని పలు గ్రామాల్లో చాలా వరకు క్లీన్ అండ్ గ్రీన్‌కి ప్రాముఖ్యత ఇస్తున్నాం. గత ఆరు నెలల నుంచి నడికూడ గ్రామ ప్రత్యేక అధికారిగా గ్రామస్తుల సలహాలు, సూచనల మేరకు సమస్యలను త్వరగా పరిష్కరిస్తున్నాం. పంచాయతీ సిబ్బందితో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపిస్తున్నాం. గ్రామస్తులు సహకరించాలి.

– చేతన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

సమాజ అభివృద్ధిలో కళాకారుల పాత్ర కీలకం

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్


ఆడియో సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కమలాపూర్ : సమాజ అభివృద్ధి, ప్రజలను చైతన్య పర్చడంలో కళాకారుల పాత్ర కీలకమని రాష్ట్ర రోడ్డు రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన కళాకారుడు బండారి సుధాకర్ రచించి, పాడిన 'ఉద్యమ నిరుద్యోగ కళాకారుల కన్నీటి వలపోత' పాటల ఆడియో సీడీని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ధూంధాం వ్యవస్థాపకుడు నేర్నాల కిశోర్, కళాకారులు బెజ్జం సదాచారి, ముత్యాల అనిల్, పిట్టల భవానితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో నాణ్యమైన విద్య

- చదువుతోనే బంగారు భవిష్యత్
- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : గురుకులాల్లో రుచికరమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుడెప్పాడ్ ఎంజేపీ బాలికల గురుకల పాఠశాలలో సోమవారం జరిగిన వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలకు అత్యధిక నిధులు కేటాయించి పెద్దపీట వేస్తోందన్నారు. రానున్న రోజుల్లో కార్పొరేట్ స్థాయిలో పరకాలలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల రూపుదిద్దుకోనున్నట్లు చెప్పారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలన్నారు. బాలికలు చదువుకు ప్రాధాన్యమిస్తే సమాజం బాగుంటుందన్నారు. పాఠశాలలో విద్యుత్, నీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పిస్తామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమేష్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, బాబుమియా, పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యలపై అధ్యయనం


చేనేత కార్మికుడితో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు డాక్టర్ గణపతి, విద్యార్థులు

దామెర : మండలంలోని ఊరుగొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు చేనేత కార్మికుల సమస్యలపై అధ్యయనం చేశారు. పాఠశాలకు చెందిన 7,8 తరగతికి చెందిన విద్యార్థుల పాఠ్యాంశాలపై అవగాహన కల్పించేందుకు సోమవారం దుర్గంపేట్ గ్రామంలో క్షేత్ర పరిశీలనలో భాగంగా చేనేత కార్మికుల కుటుంబాలను కలిశారు. ఈ సందర్భంగా చేనేత ఉత్పత్తులు చేసే విధానం, వారి జీవన విధానం, ఉపాధి ప్రభావితం చేసే అంశాలు, ఆర్థిక స్థితిగతులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు డాక్టర్ రాచర్ల గణపతి మాట్లాడుతూ.. పాఠ్యాంశంలోగల అంశాలను విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా అవగాహన కల్పించినట్లు తెలిపారు. మగ్గాలపై చేనేత కార్మికుల కళానైపుణ్యం చాలా గొప్పదని అభివర్ణించారు. అగ్గిపెట్టెలో పట్టిన పట్టుచీరను నేసిన గొప్ప కళా నైపుణ్యం కలిగిన కళారులు చేనేత కార్మికులని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీబీసీ చర్చికి రేకుల బహూకరణ



దామెర : మండలంలోని పులుకుర్తిలో తెలుగు బాప్టిస్టు చర్చిలోని స్టేజీపై సోమవారం రేకులు బహూకరించి షెడ్డు ఏర్పాటు చేశారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ మెంతుల రాజు తన తండ్రి మెంతుల (పెంచాల) మల్లయ్య జ్ఞాపకార్థం రేకుల షెడ్డు అందించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ జాన్సన్, సంఘ పెద్దలు, యువకులు రాజును అభినందించారు.

సీహెచ్‌సీలో శస్త్ర చికిత్సలు పునఃప్రారంభం


గర్భిణికి శస్త్ర చికిత్స చేసిన వైద్యులు, సిబ్బంది

కమలాపూర్ : మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నుంచి శస్త్ర చికిత్సలు పునఃప్రారంభించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేశ్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గౌతం చౌహాన్ సహకారంతో సోమవారం ఓ గర్భిణికి పెద్దాపరేషన్ విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. కొన్నేళ్లుగా శస్త్ర చికిత్సలు నిలిచిపోయి పలువురు ఇబ్బంది పడ్డారని, ఇక నుంచి స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన వారికి స్థానికంగానే శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. గైనకాలజిస్టు డాక్టర్ రమ్యా, నర్సింగ్ అధికారులుతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి

- లీగల్ అడ్వైజర్ శ్రీదేవి


సఖి సెంటర్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మహిళలు

శాయంపేట : బాధిత మహిళలు సఖి సేవలను వినియోగించుకోవాలని సఖి సెంటర్ లీగల్ అడ్వైజర్ శ్రీదేవి అన్నారు. మండలంలోని రాజుపల్లి గ్రామంలో సోమవారం మహిళలకు సఖి సెంటర్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి సెంటర్ కొనసాగుతుందన్నారు. కౌన్సెలింగ్, వైద్య, పోలీస్, తాత్కాలిక వసతి, న్యాయ సహాయం వంటి ఐదు రకాల సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. చట్టాలపై ప్రతిఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గృహ హింస, లైంగిక వేదింపులు, అత్యాచారాలు, పని చేసే చోట వేధింపులపై రక్షణ పొందేందుకు మహిళలు 181 టోల్ ఫ్రీ నంబర్‌కు, 08702452112, 7382983088కు ఫోన్ చేయాలని, సఖి సెంటర్ 24గంటలు పని చేస్తుందని అన్నారు. బాధిత మహిళలకు తక్షణ సాయం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సఖి సెంటర్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేస్ వర్కర్ అనూష, వీఓ అధ్యక్షురాలు అరుణ, వీఓఏ సరిత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కృత్రిమ గరధారణతో మేలు జాతి దూడలు



శాయంపేట : మండలంలోని గంగిరేణిగూడెం గ్రామంలో సోమవారం పశువైద్య శిబిరాన్ని మండల పశువైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణ నిమిత్తం కృత్రిమ గర్భధారణ చేయడం వలన మేలు జాతి ఆడ దూడలు జన్మిస్తాయని అన్నారు. ఈ వైద్య శిబిరంలో 29 పశువులకు గర్భధారణ పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, గోపాలమిత్ర సుదర్శన్ రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ధర్మారెడ్డి

దామెర : బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని దుర్గంపేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ముత్యాల గణేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా విషయం తెలుసుకున్న ఆయన సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గండు రాము, మాజీ వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపన పూజలో పాల్గొన్న భక్తులు

వేలేరు : మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం మూడోరోజు కొనసాగింది. గౌడ సంఘం తరుపున భక్తులు ప్రతీ ఇంటి నుంచి బిందెల్లో నీటిని, మంగళహారతిని తీసుకొచ్చి అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి దంపతుల పూజలు నిర్వహించారు.

హాల్‌టికెట్లు ఇవ్వని కళాశాలలపై చర్య తీసుకోవాలి

కేయూ క్యాంపస్: ఇంటర్మీడియట్ విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక ఫీజుల వసూళ్లను పాల్పడుతున్న ప్రైవేట్ కళాశాలలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఏబీఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దార సురేష్ ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులై..


స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

- ఘనంగా స్వయంపాలన దినోత్సవం

ఐనవోలు : విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండలంలోని పంథిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుగా వ్యవహరించి బోధించారు. ప్రతీరోజు ఉపాధ్యాయులు పడే శ్రమ, విద్యార్థులకు పాఠ్యాంశాలు చెప్పే పద్ధతి, ఇతర అంశాలను తెలుసుకున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఆనందం మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ కోసమే ఆలోచిస్తారని, తమ విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉపాధ్యాయులు ఆకాంక్షిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ, హెచ్‌ఎం పులి ఆనందంతో పాటు ఉపాధ్యాయులు, ఏఎంపీఎస్ అధ్యక్షురాలు జ్యోతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రాడ్యుయేట్ ఓటర్ల వడబోత

- నేటి మధ్యాహ్నానికి మొదలవనున్న లెక్కింపు
- మందకొడి లెక్కింపుపై అభ్యర్థుల మండిపాటు


ఓట్లు వడబోస్తున్న ఎన్నికల సిబ్బంది


బ్యాలెట్ బ్యాక్స్‌లను లెక్కింపునకు తీసుకొస్తున్న సిబ్బంది

సాక్షిప్రతినిధి,కరీంనగర్: కరీంనగర్–మెదక్–ఆదిలాబాద్–నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కౌంటింగ్ ప్రక్రియ కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. ఉదయం నుంచి రాత్రి వరకు గ్రాడ్యుయేట్ ఓట్ల వడపోత కొనసాగుతూనే ఉంది. ఉదయం 8 గంటలకు మొదలు పెట్టిన ఎన్నికల లెక్కింపు, చెల్లని, చెల్లిన ఓటర్ల విభజనపై రాత్రి 9గంటలు దాటేవరకు ఎలాంటి ప్రకటనా చేయలేదు. దీంతో రకరకాల ప్రచారాలు మొదలవడంతో రాత్రి ప్రకటించారు. అప్పటి వరకూ దాదాపు లక్ష ఓట్లను వడబోయగా అందులో 92,000 చెల్లుబాటు అయ్యాయని, 8,000 ఓట్లు చెల్లలేదని, మిగిలిన 1.5 లక్షల ఓట్ల వడబోత మంగళవారం మధ్యాహ్నం వరకు పూర్తవుతుందని అధికారులు ప్రకటించారు. మధ్యాహ్నం లెక్కింపు మొదలైనా.. తొలి ప్రాధాన్యంలో కోటా ఓట్లు రాకపోతే ఎలిమినేషన్ ప్రక్రియ మొదలవుతుందని అధికారులు వివరించారు. అందులో కోటా ఓట్లు చేరుకునే వరకు ఎలిమినేషన్ రౌండ్లు కొనసాగుతాయి.

ఆర్వో, సిబ్బందిపై మండిపాటు

గ్రాడ్యుయేట్ స్థానానికి పోటీ పడిన పలు పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో), లెక్కింపు సిబ్బందిపై మండిపడ్డారు. లెక్కింపు ప్రక్రియ మందకొడిగా సాగడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రానికి నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ ఫలితం కొలిక్కి వచ్చినా.. కరీంనగర్ కౌంటింగ్ కేంద్రం నుంచి టీచర్, గ్రాడ్యుయేట్ స్థానాలకు సంబంధించి ఎలాంటి సమాచారం బయటికి రాకపోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. పోలైన ఓట్లలో కొందరు 01, 02 అని వేసిన వారి ఓట్లు పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఆర్వోకు వినతిపత్రం ఇచ్చారు. కౌంటింగ్ నిర్వహణ సరిగా లేదని, ఓట్లలో జంబ్లింగ్ విధానం పాటించలేదని, బూత్‌ల (పలిమెల బూత్) వివరాల్లో గోప్యత పాటించకుండా బయటికి వెల్లడించారని ఆరోపిస్తూ ఆర్వోపై ఈసీకి ఫిర్యాదు చేసినట్లు మాజీ మేయర్ రవీందర్‌సింగ్ తెలిపారు. వీరితోపాటు అభ్యర్థులు విక్రంరెడ్డి, సిలివేరు శ్రీకాంత్ తదితరులు ఆర్వో తీరుపై మండిపడ్డారు. కౌంటింగ్‌లో పారదర్శకత లేదని, వెంటనే ఎన్నికలు రద్దు చేయాలని నినాదాలు చేశారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు శివ


ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

శాయంపేట : అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ వాటిని విస్మరించి ప్రజలను మోసం చేస్తుందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ విమర్శించారు. మండలంలోని సాధనపల్లిలో సోమవారం పల్లె పలకరింపు యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చిందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి గెలుపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ప్రచురించిన మ్యానిఫెస్టోను ప్రజలకు చూపించి ఎన్ని హామీలు అమలు అయ్యాయో గమనించాలని కోరారు.

మంకీ ఫుడ్ కోర్టుల అభివృద్ధికి కృషి

ఖిలా వరంగల్: కరీమాబాద్‌లోని ముకుందా లేఔట్ ప్రాంగణంలో చిల్డ్రన్ పార్కు, మంకీ ఫుడ్‌కోర్టుల ఏర్పాటుకు కృషి చేస్తానని స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి అన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని వరంగల్ 40వ డివిజన్ ప్రజలు కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.